క్లుప్తంగా

'భూముల వేలం ప్రకటన అవాస్తవం'

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని రామగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి చెందిన భూములను వేలం వేస్తున్నట్లు వస్తున్న ప్రకటనలు అవాస్తవమని ఆలయ ఈఓ జయరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి నల్లగొండ మండలం దండంపల్లి శివారులో 52.24 ఎకరాల భూమి ఉందని పేర్కొన్నారు. ఆ భూమిని కొన్నేళ్లుగా రైతులకు వేలం ద్వారా కౌలుకు ఇస్తున్నట్లు తెలిపారు. ఆ భూమిని అమ్మకానికి వేలం వేస్తున్నట్లు కొందరు వ్యక్తులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఘనంగా శ్రీ కృష్ణ పూజ



దధి మదనోత్సవం నిర్వహిస్తున్న నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణ స్వామి

రామగిరి(నల్లగొండ): భాగవత సప్తాహంలో భాగంగా నల్లగొండ పట్టణంలోని రామగిరి అక్కినేపల్లి శ్రీదేవీలక్ష్మణరావు గృహంలో ప్రవచన కర్త నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణ స్వామి ఆధ్వర్యంలో ఐదవ రోజు శ్రీ కృష్ణ పూజలు, దధి మదనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు సహస్రనామార్చన నిర్వహించారు. కార్యక్రమంలో రామ రంగాచార్యులు, సీతారామానుజచార్యులు, వేదాంతం రామ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

కనగల్ : రైతులకు సబ్సిడీపై అందించే జీలుగ, జనుము, పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి బెజవాడ అమరేందర్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ 30 కేజీల బస్తా (200 బ్యాగులు) రూ.1116కు, జనుములు 40కేజీల బస్తా (20 బ్యాగులు) రూ.1448కు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.అవసరమైన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జీరాక్స్‌తో కనగల్ రైతు వేదికకు రావాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు

నకిరేకల్ : కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైతేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. నకిరేకల్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతుందని, ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ పేదల సంక్షేమాన్ని విస్మరించి ధనిక వర్గాల వారికి కొమ్ము కాస్తున్నాడని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయమన్నారు.


విశ్వకర్మ లెజెండ్రీ అవార్డు ప్రదానం



అవార్డు తీసుకుంటున్న పెందోట సోము

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ వ్యవస్థాపకుడు పెందోట సోముకు విశ్వకర్మ లెజెండ్రీ అవార్డు దక్కింది. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఎనిమిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీసీ కమిషన్ జాతీయ అధ్యక్షుడు తల్లోజు ఆచారి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథుల పుష్పగిరి, పద్మశ్రీ పురస్కార గ్రహీత వేలు ఆనందాచారి చేతులమీదుగా సోము అవార్డు తీసుకున్నారు. మూడు దశాబ్దాలుగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కడం సంతోషంగా ఉందని సోము మంగళవారం ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సోముకు అవార్డు దక్కడంపై వీరబ్రహేంద్ర స్వామి ఆలయ పాలకవర్గం, అయ్యప్ప సేవా సంస్థ కార్యవర్గం, విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు హర్షం ప్రకటించారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

చండూరు : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ చండూరు మండల కన్వీనర్ జెర్రిపోతుల ధనుంజయ గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాంపల్లి శంకర్, వెంకటాచారి, సుజాత పాల్గొన్నారు.

జీపీ కార్మికుల వేతన వెతలు

- సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవడం లేదని ఆవేదన
- జీతాలు ఇవ్వాలని ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ధర్నాలు
- అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని వేడుకోలు



వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

చిట్యాల: పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు పాటుపడుతున్న గ్రామ పంచాయతీ (జీపీ) కార్మికులు సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేతనాల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి రావడంతో పూట గడవక దుర్భర జీవితాలు గడుపుతున్నామని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వేతనాలు అందించాలని అధికారులను వేడుకుంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారని వాపోతున్నారు.

నెలల తరబడి ఎదురు చూపులే...

చిట్యాల మండలంలోని పద్దెనిమిది గ్రామ పంచాయతీల్లో సుమారుగా వంద మందికి పైగా పంచాయతీ కార్మికులు ఉన్నారు. వీరంతా ఆయా గ్రామాల్లో వివిధ రకాల పనులు నిర్వహిస్తున్నారు. వీరిలో బిల్ కలెక్టర్లు, నల్లాలు వదిలేవారు, వీధుల్లో లైట్స్ వేసే వారితో పాటు గ్రామంలోని వీధులు, మురుగు కాల్వలను శుభ్రం చేసేవారు ఉన్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీకాలం పూర్తి కావటంతో వీరి వేతనాల చెల్లింపుల విషయమై పట్టించుకునే వారు లేకుండా పోయారు. మండలంలోని నేరడ గ్రామ పంచాయతీ కార్మికుల కుఎనిమిది నెలలుగా, ఏపూరు గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా, చిన్నకాపర్తి, ఆరెగూడెం గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా, వనిపాకల, వట్టిమర్తి గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా, వెలిమినేడు గ్రామ పంచాయతీ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు. మిగిలిన గ్రామపంచాయతీల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో అతి తక్కువ వేతనాలకు పనిచేసే కార్మికులకు సకాలంలో వేతనాలు రాకపోవటంతో వారి కుటుంబాలు రోజు వారీ ఖర్చులు, కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు. తమకు రావల్సిన వేతనాలను వెంటనే చెల్లించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆ గ్రామ పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

ఎంపీడీఓకు వినతిపత్రం అందజేత

వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు మంగళవారం చిట్యాల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం నగేష్ పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీఓ జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు, సమ్మె కాలం వేతనాలను ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నెల్లికంటి నర్సింహ, మండల గ్రామ పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షురాలు మహంకాల బాలమ్మ, కార్మికులు వలిగొండ లింగయ్య, కాసర్ల యాదయ్య, ముదిగొండ లలిత, మహంకాల సత్తెమ్మ, మేడి లక్ష్మమ్మ, జయమ్మ, మీనమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

వేతనాలు సక్రమంగా అందడం లేదు



"గ్రామ పంచాయతీల్లో నిరంతరం పనిచేస్తున్నాం. అయిప్పటికీ వేతనాలు ప్రతి నెలా సక్రమంగా అందడం లేదు. నేలల తరబడి వేతనాలు రాకపోవటంతో కుటుంబపోషణకు, ఇతర అవసరాలకు ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మా కార్మికులకు రావల్సిన వేతన బకాయిలను చెల్లించాలి.

– మహంకాల బాలమ్మ, పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు

త్వరలో వేతనాలు అందజేస్తాం

"మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులకు రెండు నెలల వేతనాలు మాత్రమే చెల్లించాల్సి ఉంది. దానికి సంబంధించి చెక్కులను ఎస్‌టీఓలో జమ చేశాం. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో వేతనాల చెల్లింపులో జాప్యం జరిగింది. మరో రెండు మూడు రోజుల్లో కార్మికులకు వేతనాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– జయలక్ష్మి, ఎంపీడీఓ, చిట్యాల

తాగునీరు కలుషితం కానివ్వొద్దు



ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు



ట్యాంక్ చుట్టూ పోసిన మట్టి

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు

మునుగోడు: తాగునీరు కలుషితం కాకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మునుగోడులోని జర్నలిస్టు కాలనీలో గల మిషన్ భగీరథ మంచి నీటి ట్యాంక్ చుట్టూ కొద్ది నెలల కాలంగా మురుగు నీరు నిల్వ ఉంటుండంతో మంగళవారం సాక్షిలో ట్యాంక్ చుట్టూ పేరుకుపాయినా మురుగు అనే శీర్షికన ప్రచురించిన కథనానికి ఎస్ఈ స్పందించారు. ఎస్ఈ ట్యాంక్‌ను పరిశీలించి

సాక్షి ఎఫెక్ట్..

దాని చుట్టూ మురుగు నీరు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు ట్రాక్టర్ల ద్వారా మట్టిని తీసుకొచ్చి ట్యాంక్ చుట్టూ పోయించారు. అంతే కాకుండా మురుగునీరు ట్యాంక్ వద్ద నిల్వ ఉండకుండా చూసేందుకు అవసరమైన ఏర్పాట్లపై నిమగ్నమయ్యారు. ఆయన వెంట డీ.ఈ శ్రీనివాస్, ఏఈ మణిదీప్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

'ఉపాధి' కూలీలకు రోజు కూలి రూ.600 ఇవ్వాలి

నల్లగొండ రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి రోజు కూలి రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రవీందర్ రెడ్డికి ఉపాధి హామీ కూలీలతో కలిసి వినతిపత్రం అందజేసి ఆమె మాట్లాడారు. 200 రోజులకు పనిదినాలు పెంచి పట్టణ ప్రాంతాలకు విస్తరింపచేయాలని కోరారు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని, ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కట్ట అంజయ్య, పనస చంద్రయ్య, తెలకలపల్లి శ్రీను, మారయ్య, శోభ ఉన్నారు.

వివాదాస్పద స్థలంలో కట్టడాలు నిలిపివేయాలి

- దేవరకొండ డీఎల్‌పీఓ మోహన్‌రావు

నాంపల్లి : నాంపల్లి మండల కేంద్రంలోని ఎస్‌బీహెచ్ ఎదురుగా ఉన్న వివాదాస్పద స్థలంలో చేపట్టిన కట్టడాలను వెంటనే నిలిపివేయాలని దేవరకొండ డివిజన్ పంచాయతీ అధికారి మోహన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. వివాదంలో ఉన్న స్థలం విషయమై కోర్టులో కేసు నడుస్తోందని, అయినా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని ఓ వర్గం వారు ఇటీవల కలెక్టర్, డీపీఓకు ఫిర్యాదు చేశారు. డీపీఓ ఆదేశాల మేరకు మంగళవారం డీఎల్‌పీఓ గ్రామ పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో ఆ స్థలాన్ని పరిశీలించారు. ఇరువర్గాల వద్ద ఉన్న భూమి పత్రాలను పరిశీలించారు. కేసు కోర్టులో సాగుతున్నందున ఈ స్థలంలో ఇరువర్గాల వారు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని, వారి నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గంజి వెంకటేశ్, సీనియర్ అడ్వకేట్ ఆకుల వెంకటరమణ, అంబేద్కర్ యువ కేంద్రం జాతీయ అధ్యక్షుడు గాలేంక గురుపాదం, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నర్సింహ, కత్తి కృష్ణారెడ్డి, సిలువేరు నారయణ, వెంకటయ్య, విజయభాస్కర్, కేశవులు, కృష్ణవేణి, భూతం శ్రీను తదితరులు ఉన్నారు.



నాంపల్లి : వివాదాస్పద స్థలంలో విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ మోహన్‌రావు

నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు అందజేత



సరుకులు ఇస్తున్న డాక్టర్ కోడి శ్రీనివాసులు

చండూరు : చండూరు మున్సిపాలిటీ పరిధిలో మూడు రోజుల క్రితం చేనేత కుటుంబానికి చెందిన చిలుకూరి పరమేశ బాబు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు మంగళవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. 50కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో చండూరు మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్, పున్నభిక్షమయ్య, రావిరాల రాజేంద్రప్రసాద్, ఏలె సుధాకర్, జూలూరు వెంకటేశం, యాదగిరి, తిరందాసు ఉమాశంకర్, చెరుపల్లి సాయి, గంజి నరసింహ, గంజి భిక్షం, జూలూరు మల్లేష్, గుండు సంతోష్, కర్నాటి రామకష్ణ, రాములు పాల్గొన్నారు.

జూన్1న హనుమాన్ జయంతి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని శ్రీమన్నారాయణ శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయంలో జూన్ 1ననిర్వహించే హనుమాన్ జయంతిని విజయవంతం చేయాలని ఆ ఆలయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. జయంతి సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నష్ట పరిహారం చెల్లించాలని తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కట్టంగూర్ : ఈదురుగాలుల బీభత్సంతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మంగళవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యంతో మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోవటంతో పాటు ఇళ్ల పైకప్పులు లేచిపోయాయని తెలిపారు. అధికారులు పరిశీలించి నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, జాల రమేష్, కట్ట బక్కయ్య ఉన్నారు.

నాణ్యత లేని విత్తనాలు విక్రయించొద్దు

- నకిరేకల్ ఏడీఏ రామారావు



శాలిగౌరారం: ఫర్టిలైజర్ దుకాణంలో బిల్‌బుక్‌లను పరిశీలిస్తున్న రామారావు

శాలిగౌరారం: ఎరువుల దుకాణాల నిర్వాహకులు నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్‌లు రద్దు చేస్తామని నకిరేకల్ ఏడీఏ రామారావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో మంగళవారం ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలలో స్టాక్ రిజిస్టర్లతో పాటు సరుకుల విక్రయాలకు సంబంధించిన బిల్‌బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల నిర్వాహకులు రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలకు విధిగా రశీదులు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయాలు జరిపినా, గడువుతీరిన పురుగుమందులు విక్రయించినా తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. రైతులు ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో ఏ వస్తువు కొనుగోలు చేసినా విధిగా బిల్లులను పొందాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చెరువు శిఖం కబ్జా చేస్తే కఠినంగా వ్యవహరిస్తాం

- మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ : చెరువు శిఖం భూములు కబ్జా చేస్తే వారిపై చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని మిర్యాలగూడ ఆర్డీఓ జి.శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. మంగళవారం మిర్యాలగూడ మండం యాద్గార్‌పల్లి గ్రామంలో గల పందిర్లపల్లి చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పందిర్లపల్లి చెరువును పరిశీలించి అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న జేసీబీని సీజ్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా భూములను ఆక్రమిస్తున్న ఇరువురు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. డివిజన్ పరిధిలోని చెరువులన్నింటిని త్వరలోనే సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని డీఐ, మండల సర్వేయర్‌ను, ఇరిగేషన్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. చెరువు శిఖం భూములను ఆక్రమిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అదేవిధంగా మండలంలోని రుద్రారం గ్రామంలోని రుద్రప్ప చెరువు మొత్తం 360 ఎకరాలు కాగా చెరువును సర్వే చేయించగా సుమారు 120 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించామన్నారు. ఈ చెరువు శిఖం భూములను ఆక్రమించిన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈ విజయలక్ష్మీ, ఆర్ఐలు ఉన్నారు.

మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్‌కు నివాళి



నకిరేకల్: ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నకిరేకల్ : టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం నకిరేకల్‌లో ఎన్‌టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యాతాకుల అంజయ్య, అధికారి ప్రతినిధి నక్క రాంబానేష్, నాయకులు అంతటి రాములుగౌడ్, పసుపులేటి కృష్ణారెడ్డి, దోనాల వెంకట్ రెడ్డి, గాదగోని ఏడుకొండలు, యాతాకుల ధనమ్మ, వాలుగొండ చిరంజీవి పాల్గొన్నారు.

గుండ్రాంపల్లిలో..



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లిలో టీడీపీ గ్రామశాఖ ఆధ్వర్యంలో మాజీ ముఖ్య మంత్రి ఎన్‌టీఆర్ జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బత్తుల వెంకటేశంగౌడ్, సీనియర్ నాయకుడు సీమ లింగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు బొడిగె విజయ్‌కుమార్, బండ అంజయ్య, చెరుకు స్వామి, గొపగోని నర్సింహ, బుస్సు మధుసూదన్, మండలోజు శ్రీనివాసచారి, రాచకొండ వెంకటేశం, మస్కు వెంకటేశం పాల్గొన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ : మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టీఆర్ జయంతిని మంగళవారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మెయిన్ సెంటర్‌లో ఎన్‌టీఆర్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దోమల వెంకన్న, గొల్లపూడి చిన్న, కాకర్ల అంజయ్య, అశోక్, గుణగంటి శ్రీరాములు పాల్గొన్నారు.

'ఆకలి రహిత ప్రపంచం' లోగో ఆవిష్కరణ

మిర్యాలగూడ : ప్రపంచ ఆకలి దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మలబార్ గోల్డ్ సంస్థ కార్యాలయంలో 'ఆకలి రహిత ప్రపంచం' లోగోను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు ఆవిష్కరించారు. కరోనా కాలంలో టాటా వంటి సంస్థలు విరాళాలు ఇవ్వడం దేశభక్తికి నిదర్శనమన్నారు. వ్యాపార రంగంలో కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఇలియాస్, సికిందర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న చిలుకూరి బాలు

శునక రాజసం !



నల్లగొండ జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సమయంలో కార్యాలయ ప్రాంగణమంతా నిర్మానుష్యంగా మారింది. ఇదే క్రమంలో ప్రాంగణంలో అధికారులకు ఏర్పాటు చేసిన కూలర్ వద్దకు ఓ శునకం వచ్చి గాలికి సేదదీరుతూ ఇలా రాజసాన్ని ప్రదర్శించింది.

–సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలి

శాలిగౌరారం: గ్రామాభివృద్ధికి చేపట్టిన పనులకు సంబంధించిన రూ.2.89లక్షల బిల్లులు చెల్లించాలని శాలిగౌరారం మండలం భైరవునిబండ గ్రామ మాజీ సర్పంచ్ దండ రేణుకాఅశోక్‌రెడ్డి సంబంధిత అధికారులను కోరారు. శాలిగౌరారం మండలకేంద్రంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలిసిన వారి వద్ద అప్పు చేసి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేశామని ఆమె పేర్కొన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మండల మిషన్ భగీరథ ఏఈ రాంబాబు తాము చేపట్టిన పనులకు వచ్చిన బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. భైరవునిబండ గ్రామ మాజీ సర్పంచ్‌కు బిల్లులు చెల్లించాల్సిన విషయం వాస్తవమేనని ప్రత్యేక అధికారి రాంబాబు తెలిపారు. పంచాయతీలో ఉన్న నిధుల్లో నిర్వహణ ఖర్చులు 80శాతం మినహాయించి విడతల వారీగా 20 శాతం చొప్పున చెస్తామని వివరణ ఇచ్చారు.

రామకృష్ణాపురంలో మంచినీటి కష్టాలు

- పగిలిన నీటి సరఫరా పైపులు.. పనిచేయని మోటారు
- మరమ్మతులు మరచిన అధికారులు
- పది రోజులుగా ఇబ్బందులు పడుతున్న కాలనీ ప్రజలు



ప్రైవేట్ ట్యాంకర్ తెప్పించుకుని నీటిని పట్టుకుంటున్న రామకృష్ణాపురం కాలనీవాసులు

మునుగోడు: మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురంలో నివాసం ఉండే ప్రజలు పది రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఆ కాలనీలో ఉన్న 60 ఇళ్లలో దాదాపు 230 మంది నివాసం ఉంటున్నారు. ఆ ప్రజలకు మంచి నీటి సరఫరా చేసేందుకు పక్కనే ఉన్న సోలిపురం గ్రామంలోని చెరువులో గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక బోరు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తున్నారు. అయితే ఆ నీరు సరఫరా చేసే పైపులు అక్కడక్కడా పగిలిపోవడంతో పాటు మోటారు మరమ్మతులకు గురైంది. మోటారుకు మరమ్మతులు చేయించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ కాలనీకి నీరు సరఫరా కావడం లేదు. దీంతో కాలనీవాసులు అవసరాలను తీర్చుకునేందుకు ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కాలనీ ప్రజలకు మంచి నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

ప్రయాణం నరకప్రాయం !

- అధ్వానంగా కోతులారం – కొంపల్లి రోడ్డు
- అడుగడుగునా గుంతలు.. ఆపై తేలిన కంకరతో అవస్థలు
- వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ప్రయాణికుల ఆవేదన



కంకతేలిన కోతులారం- కొంపల్లి రోడ్డు

మునుగోడు: మండలంలోని కోతులారం-కొంపల్లి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో పాటు తేలిన కంకరతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. ఐదు సంవత్సరాలుగా అవస్థలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేయించకపోవడంతో..

మండల కేంద్రానికి 12 కిలో మీటర్ల దూరంలో ఉన్న కోతులారం గ్రామానికి 2008వ సంవత్సరం వరకు సరైన రోడ్డు మార్గం లేదు. కేవలం కంకర రోడ్డు మాత్రమే ఉండటంతో దాని వెంట రాకపోకలు జరిపేందుకు ఆ గ్రామ ప్రజలు అవస్థలు పడేవారు. దానిని గమనించిన అప్పటి ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని పంచాయతీరాజ్ నిధుల నుంచి కిలో మీటరుకు రూ. 65 లక్షల చొప్పున కొంపల్లి నుంచి కోతులారం 5కిలో మీటర్లు, కోతులారం నుంచి చల్మెడకు మరో 5కిలో మీటర్లు 2009వ సంవత్సరంలో నిధులు మంజూరు చేయించి ఆరు నెలల కాలంలో రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. అయితే ఆ రోడ్డుకు అప్పటి నుంచి ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు అంతా ధ్వంసమై గుంతలమయంగా మారింది. దీంతో ఆ రోడ్డు వెంట రాకపోకలు జరిపే ప్రయాణికులు తాము అనుకున్న సమయానికి గమ్యం చేరలేకపోతున్నారు.కంకర, గుంతల కారణంగా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డుకు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించి వెంటనే పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలు సాగించలేక పోతున్నాం



"గ్రామానికి వెళ్లే రోడ్డు ఐదేళ్ల క్రితమే ధ్వంసమైంది. రాకపోకలు జరపలేకపోతున్నాం. రోడ్డు మొత్తం గుంతలు ఉండటంతో వాహనాలు వేగంగా నడపలేకపోతున్నాం. ఎక్కడా కిందపడిపోతామోనని మెల్లగా నడుపడటంతో సమయానికి గమ్యం చేరుకోలేకపోతున్నాం. అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేయించాలి.

– జాజుల సత్యనారాయణ, కోతులారం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

"కోతులారం- కొంపల్లి రోడ్డు అలాగే చల్మెడ నుంచి కోతులారం వరకు ఉన్న 10 కిలో మీటర్ల రోడ్డు ధ్వంసమైంది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆ రోడ్డు మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరుచేయిస్తాం. ఆ వెంటనే టెండర్ పిలిచి మరమ్మతులు చేయిస్తాం.

– సతీష్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ, మునుగోడు